ॐ

अगन्मज्योतिरुत्तमम् - ऋग्वेद

वेदगङ्गा ವೇದಗಂಗಾ

Vedagaṅgā Vol. - XXVIII

धर्माय स्वाह अधर्माय स्वाहा धर्म इति धर्मेन सर्वमिदं परिगृहीतम्
धर्मान्नाति दुष्करम् – यजुर्वेद (महानारायणोऽपनिषत्)

Chief Editor : **Dr. Calyam Anjaneya Prasad,** USA

Nada Vedaadhyayana Kendra (R.)

No.437, 17th Cross, 15th Main, 5th Phase
J.P. Nagar, Bangalore-560 078. Ph.: 26596150 / 26592489
Web : http//nvak.tripod.com email : clprabhakar@yahoo.com
facebook page: https://www.facebook.com/NadaVeda/?ref=page_internal
youtube channel: https://www.youtube.com/channel/UCzBmBHy2t6QjO0bbr5UBJqQ

DECEMBER 2022

యజ్ఞ యాగములు - వైశిష్ట్యము

డా॥ రాఘవ యస్. బొడ్డుపల్లి

సంస్కృతము మరియు వేదాధ్యయన సంస్థ, సంజయనగర్, బెంగళూరు – 560094

raghava7boddupalli@gmail.com

Abstract

The Vedic texts and their allied works are intimately related to Vedic sacrifices, i.e. Yajñas and Yāgas. Hence, an understanding of the Vedic sacrificial system will definitely help us to understand and esteem, not only the Vedas, but also the Upaniṣads. Yajña is the subject of matter of entire Veda. The Yajurveda contains the knowledge of doctrines and the methods of performing Yajñas and Yāgas as spiritual and scientific approaches for global welfare. In this article, some general rules to be followed to perform Yajña / Yāga / Iṣṭi, classification of Yajñas, brief account of some well-known Yajñas, havis / oblations, Ṛtviks or Priests, Yajñāgni, Yajña implements, several terms those are mostly pronounced on the subject of Yajña and other requirements are discussed. Yajña-Yāgas exerted a great influence on our ancient society either directly or indirectly. Hence, it is very important to perform Yajñas periodically for purification of the environment, for the society and beneficial for the individual good, which still survives in various forms even today.

వేదములు - వర్గీకరణ

భారతదేశము వేదభూమి, తపోభూమి మరియు యజ్ఞభూమి. వేదమంత్రములను దర్శించినటువంటి వారు ద్రష్టలు లేక ఋషులు అని అందురు. మన ఋషులు విన్న ఈ వేదమంత్ర రాశిని, శ్రీ వేదవ్యాస మహర్షి ఇతర మహర్షులతో కలిసి క్రోడీకరించి మరియు వర్గీకరణము ఈ విధముగ చేసినారు: (1) ఋగ్వేదము నందు దేవతా వర్ణనలు మొదలగునవి, సూక్తముల ద్వారా వచన జ్ఞానము. వీటినే ఋక్కులు అని అనబడును, (2) యజుర్వేదము - యజ్ఞ సూత్రములు మరియు యజ్ఞ యాగాదుల విధులయొక్క

రీతులను బోధించును. వీటినే యజుస్సులు అని అందురు, (3) సామవేదము - శ్లోక జ్ఞానము, వీటిని సామములు అని చెప్పుదురు, మరియు (4) అథర్వణవేదము - అథర్వణ పరిజ్ఞానము - వైద్య విజ్ఞానము, శాంత్యాదులను గురించి వర్ణనలు ఉన్నవి. ఈ వేదమునందు ఋక్కులు, యజుస్సులు, సామములు కలిసియున్నవి.

సనాతన ధర్మ మఠ స్థాపన

చతుర్వేదములను అనుసరించి శ్రీ శఙ్కర భగవత్పాదుల వారు సనాతన ధర్మ మఠ స్థాపన ఈ క్రింది విధముగ ప్రతిష్ఠించినారు: (1) పూర్వామ్నాయ శ్రీ గోవర్ధన పీఠం లేక గోవర్ధన మఠం, పూరి, ఒడిశా - ఋగ్వేద పీఠం, (2) దక్షిణామ్నాయ శ్రీ శృఙ్గేరి శారదా పీఠం, శృంగేరి, కర్ణాటక - యజుర్వేద పీఠం, (3) పశ్చిమామ్నాయ శ్రీ శారదా పీఠం లేక ద్వారకా శారదా మఠం, ద్వారక, గుజరాత్ - సామవేద పీఠం, మరియు (4) ఉత్తరామ్నాయ శ్రీ జ్యోతిర్ పీఠం లేక జ్యోతిర్ మఠం, గరహవల్, ఉత్తరాఖండ్ - అథర్వవేద పీఠం.

వేద ప్రాశస్త్యం

కంచి పరమాత్మ, నడిచేదేవులు, శ్రీ శ్రీ శ్రీ చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతి స్వామి (1994) 'వేద ప్రాశస్త్యం' గురించి తమ మంగళాశాసనము నందు ఈ క్రింది విధముగా ప్రవచించినారు. వేదములు ప్రాచీన భారతదేశము నందు ఉద్భవించిన పవిత్ర గ్రంథములు. ఇవి సకల విజ్ఞానమునకు మూలస్తంభములు. 'విద్' అను ధాతువు నుంచి వచ్చిన పదం 'వేదం'. విద్ అనగా 'జ్ఞానముగల' లేక 'తెలిసికొనుట'. ॥ '*వేదయ తీతి వేదః*' ॥ అనగా 'తెలియజేసేది గనుక వేదం'. ॥ '*స్వయం సర్వం వేత్తీతి వేదః*' ॥ అనగా 'సర్వజ్ఞత్వం' కలదని భావము అని మరొక నిర్వచనము. వేదం అపౌరుషేయ శాస్త్ర జ్ఞానం. వేదములు శబ్దతరంగ రూపాలు. పరమేశ్వరుని ఉచ్ఛ్వాస నిశ్వాస రూపాలు. ధ్వని ఎంత ప్రాచీనమో శబ్ద తరంగ రూపమైన వేదరాశి అంత ప్రాచీనం. వేదములు నిత్యములు. సృష్టి ఎంత ప్రాచీనమో వేదములు అంత ప్రాచీనములు. వేదాలు ఒక తరం

నుండి మరొక తరానికి మౌఖికంగా అందించబడ్డాయి. ఏ వ్రాతపూర్వక వచనం నుండి బోధించబడలేదు లేదా నేర్చుకోలేదు. అందువలన వేదములకు 'శృతి' అనే పేరు వచ్చింది.

యజ్ఞ సూత్రం

యజ్ఞ సూత్రం అంటే 'యజ్ఞోపవీతం' లేక 'జందెం'. ఇది వైదిక కర్మాచరణకు అర్హత కలిగిస్తుంది కనుక యజ్ఞ సూత్రం. వేదాధ్యయన యోగ్యత కలిగిస్తుంది గనుక బ్రహ్మసూత్రం. ఉపనయన సమయంలో అది బ్రహ్మసూత్రం. ఎడమ భుజము మీద నుంచి ఒక వైపు ఉదర భాగాన్ని, మరొక వైపు వీపును తగులుతూ కుడిచేతి క్రింద వ్రేలాడుతున్నప్పుడు అది ఉపవీతం. యజ్ఞసూత్రం ఇలా ఉన్నప్పుడు దేవతా కార్యాలన్నీ చేయవచ్చు. యజ్ఞ సూత్రం మెడలో హారంవలె వ్రేలాడు తున్నప్పుడు అది నివీతం. పితృ, ఋషి తదితర తర్పణములందు మరియు మలమూత్ర విసర్జనాదులలో యజ్ఞోపవీతం నివీతంగా ఉండాలని శాస్త్రం.

యజమానుడు లేక యజ్ఞకర్త

యజ్ఞ-యాగాదులకు ప్రధాన వ్యక్తిని 'యజమానుడు' అని పిలిచెదరు. యజమాన అను పదమునకు వ్యుత్పత్తి అర్థము యజ్ఞము లేక యాగము చేయువాడు - యజ్ఞకర్త. యజ్ఞము యొక్క ఖర్చులన్నిటిని, ఈ యజమానే భరించును మరియు యజ్ఞ ఫలములను పొందువాడు అతడే. యజమానుని ధర్మపత్ని కూడా ఈ యజ్ఞ-యాగాదులందు ముఖ్యపాత్ర వహించును. వారిరువురు యజ్ఞము కొరకు దీక్ష తీసుకోబడుదురు. దీక్షా అనగా యజ్ఞాదిక్రియారంభమునందు అనుష్ఠింప పూనుకొనెడు ఆచారనియమము.

శ్రీరుద్రంలో యజ్ఞ వివరాలు

శ్రీరుద్ర చమకములోని ఎనిదవ అనువాకము నందు, యజ్ఞం నిర్వహించటానికి కావలసిన వస్తువులు మరియు పదార్థములను క్లుప్తంగా కోరుతూ ఆ రుద్రభగవానుని ప్రార్థించెదము - పవిత్రమైన సమిధలు (ఇధ్మం), దర్భలు (బర్హి), యజ్ఞవేది, హోమకుండము, స్రుక్, స్రువములు, యజ్ఞమును నిర్వహించే ఋత్వికులు (ధిష్ణి), వారికి ఉన్నతమైన ఆసనములు, సోమలతను దంచి రసము తీయుటకు ఉపయోగించే

రాళ్ళు (గ్రావాణము), దర్భ మరియు సోమ కొమ్మలను కోయుటకు చెక్కతో చేయబడిన కత్తులు (స్వరవశ్చ), అధిషవణ ఫలకములు (సోమరసాన్ని తీయుటకు), ద్రోణకలశము (సోమరసాన్ని నిల్వచేయుటకు), చమస పాత్రలు (సోమరసాన్ని త్రాగుటకు), పురోడాశ హవిస్సు, కర్రతో యూపస్తంభమును తయారు చేయునపుడు క్రిందపడిన పేళ్ళు, యజ్ఞములో ఉపయోగించే వాయవ్య, పూతభృత్ మరియు ఆధవనీయ అను పేర్లుగల మట్టి పాత్రలు, ఆగ్నీధ్ర ఋత్వికుడు (బ్రహ్మకు సహాయకుడు, యజ్ఞవేదికి ఉత్తర దిక్కున కూర్చుని, యజ్ఞాగ్నిని రగిలించు ఋత్వికుడు), హవిర్ధానము (హవిస్సు ఉంచబడు స్థలము), యజ్ఞమును తిలకించుటకు విచ్చేసిన సదస్యులకు పందిళ్ళు, పూర్ణాహుతి సందర్భముగా హోమ ద్రవ్యములను స్వగాకారమును సంపూర్ణముగా నేను అగ్నికి ఆహుతి చేయుదునుగాక! యజ్ఞ పరిసమాప్తి జరిగిన తరువాత పవిత్రమైన జలముతో అవభృథ స్నానము చేయు అవకాశము నాకు లభించుగాక!

యజ్ఞం పూర్తయిన తరువాత యజమాని, యజమాని ధర్మపత్ని, వారి సంతానముచేత ఋత్వికులు పవిత్రజలాలతో స్నానం చేయించెదరు. ఈ సమయమునందే యజమాని దీక్షా విరమణ జరుగును. యజ్ఞనిర్వహణలో దోషాలు జరిగి ఉంటే వాటి పరిహారార్థం యజ్ఞంలో భాగంగా నిర్దేశితమైన చివరి ఘట్టం.

యాగము

ఆదిమిథునములోని పురుషుడే యాగము. యాగము ఒక ఆచారకర్మ. దేవతలను ఆరాధించే శ్రౌత కర్మ. అంటే, దేవతలకు చెందాలని కోరుతూ హోమ కుండంలో హవిస్సులు అర్పణ చేయటం. యాగంలో ఐదు ముఖ్యాంశాలు ఉన్నాయి. 1. అశ్రావయ, 2. అస్తు శ్రౌషట్, 3. యజ, 4. యే యజామహే, 5. వషట్. ఇవి యాగ శరీరాన్ని రూపొందించే ప్రధాన మంత్రాలు. వీటికి ముందు వెనుక చేసే పనులు, కల్పించే హంగులు అన్నీ వస్త్రాలంకారాల వంటివి. ఇందులో అశ్రావయ ప్రారంభ రూపం. చివరది వషట్కారం. కృష్ణ యజుర్వేద తైత్తిరీయ సంహితలో యాగాన్ని కామధేనువుతో పోల్చి, ఈ ఐదు అంశాలను వివరించారు. యజ్ఞ వాక్కులు కామధేను రూపం ధరిస్తున్నాయి. యజ్ఞ వాక్కులను సూనృత వాక్కులన్నారు. యజ్ఞం చేసే

యజమాని ఆశ్రావయ అనే మంత్ర పారనం చేత యజ్ఞ రూప సూనృత వాక్ ధేనువును ఆహ్వానిస్తాడు. అది ప్రారంభం. (ప్రాయణమ్) కామధేనువు పాలు చేపడానికి దూడను దగ్గరకు పిలవడం రెండవ అంశం. దీనికి ఉపయోగపడేది 'అస్తు శ్రౌషట్' మంత్రం. పాలు పిండుకోవడానికి పాత్రను సిద్ధం చేయడం మూడవ అంశం. ఇందుకు సంబంధించిన మంత్రం 'అజ'. దోగ్ధ, అంటే పాలు పిండుకొనే యజమాని 'యే యజామహే' మంత్రముతో ధేనువు వద్దకు వెళతాడు. యజ్ఞం ద్వారా సాధించుకొన దలచుకొన్న కోర్కెను సాధించడం చివరి అంశం. 'వషట్' అనే మంత్రముతో ఇది పూర్తవుతుందని శ్రుతి వచనం. ఈ ఐదు మంత్రాలలో మొత్తం పదిహేడు (సప్తదశ) అక్షరాలు ఉన్నాయి.

యజ్ఞయాగాలలో ప్రసిద్ధమైనవి కొన్ని ఇవి: అగ్న్యాధానం, దర్శపూర్ణ మాసాలు, పిండపితృయజ్ఞాలు, ఆగ్రయణం, చాతుర్మాస్యం, నిరూఢ పశు బంధం, సౌత్రామణి, ఔపాసనం, వైశ్వదేవం, స్థాలీపాకం, సర్పబలి, సత్రయాగం, ఈశానబలి, అష్టకాన్వష్టక సోమ యాగం, అగ్నిష్టోమం, అత్యగ్నిష్టోమం, ఉక్థ్యం, షోడశి, వాజపేయం, అతిరాత్రం, ఆప్తోర్యామం, సర్వతోముఖం, రాజసూయం, పౌండరీకం, అభిజిత్త, విశ్వజిత్త, అశ్వమేధం, బృహస్పతి సవం మరియు అంగిరసం. ఈ యాగములన్నిటిని యజుర్వేద సంహిత మరియు బ్రాహ్మణాలలో విశదీకరింపబడ్డాయి. ఈ వ్యాసమునందు ఇవి తరువాత క్లుప్తముగా వర్ణింపబడ్డాయి.

ఇష్టి

ఇష్టి అనగా 'కోరిక' అను అర్థము ఉన్నది. యాగము మరియు యజ్ఞముతో పోలిస్తే, ఇష్టి ఒక చిన్న ప్రక్రియ. దర్శ, పౌర్ణమాస యజ్ఞభేదములను కూడా ఇష్టి అని పిలిచెదరు. సంతానం పొందాలనే కోరికతో యాగం నిర్వహిస్తారు. దీనిని 'పుత్రకామ ఇష్టి' లేక 'పుత్రకామ్యేష్టి' అని అందురు (రాఘవ బొడ్డుపల్లి, 2019).

1. అన్నకామేష్టి (తై. సం. 1-3-8) - పుష్కలంగా ఆహారం పొందడానికి ప్రతిపాదింపబడిన ఇష్టి. అగ్ని మరియు విష్ణువులకు హవిస్సులు సమర్పిస్తారు.

2. ఆదిత్యేష్టి (తై. సం. 2-3-1) - రాజ్యాన్ని పొందేందుకు రాజులు చేయవలసిన ఇష్టి. ఆదిత్యునికి హవిస్సులు సమర్పిస్తారు.

3. ఆతిథ్యేష్టి (తై. సం. 6-2-1) - సోమయాగములో ఒక అఙ్గము. ఆశీస్సులు పొందేందుకు సోముని గౌరవార్థం ఇష్టి.

4. పశుకామేష్టి (తై. సం. 2-1-1) - పుష్కలంగా పశువులను పొందేందుకు చేయవలసిన ఇష్టి. సోముడు మరియు పుషన్ కు హవిస్సులు సమర్పిస్తారు.

5. సాకంప్రస్థాయీయేష్టి (తై. సం. 2-5-4) - పుష్కలంగా పశువులను పొందేందుకు చేయుదగు ఇష్టి. అగ్నికి హవిస్సులు సమర్పిస్తారు.

6. త్రయంబకేష్టి (తై. సం. 1-8-6) - అపమృత్యు దోషం మరియు జనన మరణ చక్రం నుండి విముక్తి పొందేందుకు ప్రతిపాదింపబడిన ఇష్టి. త్రయంబకునికి / రుద్రునికి హవిస్సులు సమర్పిస్తారు.

7. కరీరేష్టి (తై. సం. 2-4-9) - వర్షాలు కురిపించేలా వరుణుడిని పురస్కరించుకుని ఇష్టి. కరీర (*Capparis decidua*) ఫలములు హవిస్సులుగా సమర్పిస్తారు. రాజ్యం లేక రాష్ట్రం కరువు కాటకములతో ఇబ్బంది పడునప్పుడు, కరీరేష్టిని నిర్వహించుబడును.

8. నక్షత్రేష్టి (తై. బ్రా. 3-1-4) - బ్రహ్మవర్చస్సు, ఆధ్యాత్మిక ప్రాధాన్యత అభ్యర్థించు ఇష్టి. బృహస్పతికి హవిస్సులు సమర్పిస్తారు.

9. నక్షత్రేష్టి (తై. బ్రా. 1-3-4) - పశుసమృద్ధి కోసం చేయదగు ఇష్టి. రుద్రదేవునికి హవిస్సులు సమర్పిస్తారు.

10. త్రైధాతవీయేష్టి (తై. సం. 2-4-11) - అన్ని కోరికలను నెరవేర్చుటకు చేయవలసిన ఇష్టి.

11. పవమానేష్టి (తై. బ్రా. 1-1-5) - దైవిక వైభవాన్ని, తేజస్సు పొందేందుకు, మరియు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయడానికి అగ్నికి హవిస్సులతో నిర్వహించబడే ఇష్టి.

12. అహోరాత్రేష్టి - రాజ్యాన్ని తిరిగి పొందేందుకుగాను చేయబడే ఇష్టి. వరుణ దేవతకు హవిస్సులు. సమర్పిస్తారు.

13. కామ్యేష్టి - అపారమైన సంపదను సంపాదించి మరియు రాజ్యాన్ని తిరిగి పొందేందుకు చేయు ఇష్టి. ఆదిత్య దేవతకు హవిస్సులు సమర్పిస్తారు.

14. వసుకామేష్టి - ధన ధాన్యాభివృద్ధి కొరకు చేయు ఇష్టి.

15. ప్రజాకామేష్టి - యోగ్యమైన కుమారులను పొందుటకు చేయవలసిన ఇష్టి. ప్రజాపతికి హవిస్సులు.

16. ఆయుష్కామేష్టి - ఆరోగ్యకరమైన శరీరం మరియు దీర్ఘాయువు పొందేందుకు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉపశమనం కలుగచేయు ఇష్టి.

17. సర్వపృష్ఠేష్టి - పురుషత్వాన్ని పెంచడానికి చేయు ఇష్టి.

18. శతక్రష్ణలేష్టి - మృత్యు భయం తొలగించు ఇష్టి.

19. యవిష్ఠేష్టి - వామతంత్రము నుండి రక్షణ కలిగించు ఇష్టి.

యజ్ఞము

'యజ్ఞ' నామము 'యజ' అను ధాతువు నుండి ఉద్భవించినది. యజ్ + నఙ్ - '*ఇజ్యతే హవిః దీయతే అత్ర*' - ఇక్కడ హవిని ఈయబడును, అనగా యజ్ఞము. '*ఇజ్యన్తే పూజ్యన్తే దేవతాః అత్ర*' - దేవతలు ఇక్కడ పూజింపబడుదురు, అందువలన ఇది యజ్ఞము. దేవపూజా-సంగతి-కరణ-దానేషు యజతి, యజతే అనగా పూజించుట, సత్సంగము చేయుట, దానము చేయుట అని అర్థములు. '*యజ్ఞో వై విష్ణుః*' - యజ్ఞ పురుషుడు మరియు యజ్ఞభోక్త విష్ణువు. యజ్ఞః పదముకు 'అధ్వరః' మరియు 'శివః' అను అర్థములు చెప్పబడినవి.

అగ్నిహోత్రంతో దేవతల ప్రీతి కోసం చేసే కర్మకాండని 'యజ్ఞము' అని అందురు. ఇవి పాక యజ్ఞాలని, హవిర్యజ్ఞాలని, సోమ యజ్ఞాలనీ స్థూలంగా త్రివిధాలు. తిరిగి, ఇవి ఒక్కొకటి ఏడేసి విధాలు — (1) ఔపాసన, (2) వైశ్వదేవ, (3) స్థాలీపాక, (4) సర్పబలి, (5) ఈశాన్యబలి, (6) అష్టక మాసి, (7) శ్రాద్ధం అని పాక యజ్ఞాలు ఏడు విధాలు. వీటికి లౌకికాలనే పేరు కూడా ఉన్నది. స్మార్తాగ్నియందు చేయఁబడు యజ్ఞములు, పాకయజ్ఞములు. స్మార్తాగ్నియు, ఔపాసనాగ్ని హవిర్యజ్ఞములును, సోమ యజ్ఞములు రెండును

శ్రౌతాగ్నియందు చేయబడునవి. ఇవన్నీ గాక రాజసూయం, పౌండరీకం, బృహస్పతి సవం, మొదలైన అభ్యుదయకర యజ్ఞాలు ఉన్నాయి. బ్రాహ్మణుడు విధిగా చేయవలసిన పంచ మహా యజ్ఞాలు. అవి: 1. దేవయజ్ఞం, 2. పితృయజ్ఞం, 3. భూతయజ్ఞం, 4. మనుష్యయజ్ఞం, 5. బ్రహ్మయజ్ఞం. దేవయజ్ఞంలో ఔపాసనం ప్రధానం. సూర్యాగ్నులను అర్చించడం ఇందులో పద్ధతి. పితృయజ్ఞం అంటే పితృదేవతలను స్మరిస్తూ చేసే శ్రాద్ధతర్పణాదులు. భూతయజ్ఞం బలిరూపంలో ఉంటుంది. మనుష్యయజ్ఞం అంటే ఎవరికైనా భోజనం పెట్టడం. బ్రహ్మయజ్ఞం అంటే నిత్యం వేదాధ్యయనం చేయడం. యజ్ఞవిధాన వివరణము ఆపస్తంబసూత్రమునందు చెప్పబడిఉన్నవి.

యజ్ఞ యాగాదుల ముఖ్యోద్దేశం

యజుర్వేదం ప్రపంచ సంక్షేమం కోసం ఆధ్యాత్మిక శాస్త్రీయ విధానాలుగా సిద్ధాంతాల జ్ఞానం మరియు యజ్ఞ, యాగాదులను అవిచేసే పద్ధతులను వివరించియున్నది. యజుర్వేద సంహిత, బ్రాహ్మణములు చారిత్రాత్మక వైదిక ధర్మం. వాటికి సంబంధించిన యజ్ఞ యాగాదులను చేయడానికి అవసరమైన మంత్రజ్ఞానాన్ని అందించింది. అగ్నిని 'దేవ ముఖ' అని పిలుస్తారు మరియు యజ్ఞానికి కేంద్ర దైవం. మొక్క/చెట్టు మరియు వాటి ఉత్పత్తులను ఉపయోగించకుండా ఎటువంటి యజ్ఞ యాగాదులను నిర్వహించలేరు. యజ్ఞాయుధ లేదా యజ్ఞ పరికరములు ఎక్కువ భాగం చెక్కతో తయారు చేయబడినవి మరియు ఈ చెట్ల పేర్లు యజుర్వేదంలో వెల్లడి చేయబడ్డాయి మరియు వివరించబడ్డాయి. మన ఋషులు యజ్ఞ యాగాదులను నిర్వహించి, వాటి విధి విధానాలను మార్గదర్శకాలను అందించి మనకు మార్గదర్శకులయ్యారు (రాఘవ బొడ్డుపల్లి, 2019).

యజ్ఞ వైవిధ్యం

యజ్ఞాలు ఎన్నో ఉన్నప్పటికీ, ప్రధానంగా అవి 'ప్రకృతులు', 'వికృతులు' అని రెండు విధాలు. యజ్ఞంలో చేయవలసిన అన్నింటిని గురించి శ్రుతి తెలియచేసినవి ప్రకృతులు. విశేషాంగాలను గురించి

మాత్రమే శ్రుతి తెలియజేయనివి ఉంటే అవి వికృతులు. వికృతులలో వేటిని గురించి శ్రుతి చెప్పలేదో వాటిని ప్రకృతుల నుంచి గ్రహించవలసి ఉంటుంది. 'ప్రకృతివద్వికృతి కార్యా' అని శాస్త్రం. ఉదాహరణకు 'విఘువం' అనేది వికృతి యజ్ఞం. దీనికి అగ్నిహోమం అనే ప్రకృతి యజ్ఞం నుంచి కొన్ని అంశాలను గ్రహించవలసి ఉంటుంది. 'వేదసార రత్నావళి' ఇందుకు సంబంధించిన మరిన్ని వివరాలను అందిస్తుంది.

యజ్ఞం, యజ్ఞ విధి, ప్రయోజనాలు

యజుర్వేద అవగాహనకు యజ్ఞము కీలకము. యజుర్వేద సంహిత నందలి మంత్రభాగం, వివిధ యజ్ఞములు, యాగములు, హోమములు మరియు ఇష్టిలను నిర్వహించవలసిన విధానము సవివరంగా వివరిస్తాయి. యజ్ఞాచరణము నందు ఉత్పన్నమయే పలు ప్రయోజనములు వివరణాత్మకముగా శుక్ల (18-1, 18-2, 18-6) మరియు కృష్ణ యజుర్వేద సంహితల (4-7-5, 4-7-9) యందు వర్ణింపబడినది (*యజ్ఞేన కల్పన్తామ్* / *యజ్ఞేన కల్పతామ్*). యజుర్వేద సంహితలు యజ్ఞ ప్రయోజనములను విపులముగా వర్ణించును, అవి ఏమనగా: ఆహార సమృద్ధి (వాజ), సంపద (ప్రసవ), పనిలో సామర్థ్యం (ప్రయతి), మానసిక తీక్షణత (ధితి), జ్ఞానోదయము (జ్యోతి), భౌతిక దార్ఢ్యము (ఓజస్సు), ఆయుర్దాయము (దీర్ఘాయువు), ఆరోగ్యము (అనామయ), ప్రశాంతత్వము (శర్మ), నిర్భయము (అభయ), స్నేహము (అనమిత్రం) మరియు సుఖ నిద్ర (సుఖం శయనమ్). యజ్ఞ ప్రారంభ సమయమున ఈ యజ్ఞము ద్వారా తన జీవితము సార్థకము కావలెనని యజమాని ప్రార్థించును.

యజ్ఞవేది

యజ్ఞవేది అనేది ఎత్తైన లేదా త్రవ్వబడిన ప్రదేశము. ఈ వేది దర్భ గడ్డితో నింపబడి, యజ్ఞాయుధములు లేక యజ్ఞ పరికరములు మరియు పాత్రలు ఉంచబడును. ఇది దీర్ఘచతురస్రాకార ఆకారంలో ఉన్న ప్రాంతంలో నిర్మిస్తారు. దీని ఉత్తర, దక్షిణ భుజాలు పుటాకారంగా ఉంటాయి. శ్రౌత గ్రంథాలలో వివరించిన విధంగా, యాజ్ఞవేది యొక్క కొలతలు మరియు ఆకారం అవి ఆచరించే యజ్ఞ-

యాగాదుల యొక్క రకాన్ని బట్టి మారుతూ ఉంటాయి. యజ్ఞ యజమాని యొక్క ఎత్తు ప్రమాణముగా తీసుకొని, యజ్ఞవేది వివిధ కొలతలను నిర్ణయించబడును.



యజ్ఞవేదితో అనుబంధించబడినది 'చయనము' లేదా 'అగ్నిచయనము'. ఇది సోమయాగాలలో అగ్నికుండం కోసం ఇటుకతో కట్టబడును. ఇది ఐదు పొరల ఇటుకలతో నిర్మించబడుతుంది. ఇది సుపర్ణ (డేగ), శ్యేన (గద్ద) మరియు దోనె వంటి అనేక ఆకారాలను కలిగి ఉంటుంది. దీనికి ఉపయోగించబడు ఇటుకలు కూడా వివిధ ఆకృతులను కలిగి ఉండును. అవి - త్రిభుజాకార, దీర్ఘచతురస్రాకార లేదా చదరపు ఆకారములు.

ఏ యజ్ఞవేది నిర్మాణమైనా ఆయా నిబంధనల ప్రకారమే జరగాలి. మొట్టమొదట, నిర్వహించవలసిన యజ్ఞం మరియు వివిధ ఆచారాలను నిర్వహించడానికి స్థలం ఎంపిక చేయబడుతుంది. ఉదాహరణకు, సోమ యాగం చేయడానికి సంతృప్తిపరిచే స్థలాన్ని ఎంచుకోవాలి. సోమ యాగం చేసే స్థలంలో తూర్పు వైపు నీరు ఉండాలి. ఈ స్థలం ఉప్పనేల అయి ఉండరాదు. మరియు సారవంతమైన భూమిగా ఉండాలి. వృక్షసంపద పుష్కలంగా ఉండాలి మరియు వివిధ రకాల మొక్కలతో కలిసి ఉండాలి. భూమిని ఈశాన్యం వైపు వాలుగా ఉండాలి, తద్వారా

నీరు 'కాట్వాలా' వైపు ప్రవహిస్తుంది. ఇది మహావేది యొక్క ఈశాన్య మూలకు సమీపంలో ఉంటుంది. ఇచట ఉదహరించబడిన యజ్ఞవేది నమూనా (పైన చిత్రం), ఒక్క అగ్నిహోత్ర, దర్శ-పూర్ణమాస మరియు ఇష్టిలకు ఉపయోగపడు యజ్ఞవేది (స్వామి హర్షానంద, 2008).

యజ్ఞవేది నిర్మాణములు, రేఖాగణిత కొలతలు మరియు నిర్మాణ నమూనాలను కలిగి ఉంటాయి. బౌధాయన, ఆపస్తంబ, కాత్యాయన శ్రౌతసూత్రముల యందు వివిధ యజ్ఞవేదులను సవివరంగా వివరించాయి (కాషికర్ మరియు దండేకర్ 1958; కాషికర్ 1966).

యజ్ఞ నిర్వహణ - ఋత్విజులు

ఆగ్నీధ్రుడు మొదలగు పదునారుగురు ఋత్విజులు యజ్ఞకర్తకు సహాయకులుగా నుండి యజ్ఞము/యాగములను నిర్వహిస్తారు. యజ్ఞమునందు అగ్నిని ప్రకాశింపజేయువానిని 'ఆగ్నీధ్రుడు' అని అందురు. ఆగ్నీధ్రుడు కూర్చుండు స్థానమును 'ఆగ్నీధ్రీయము' అని పేరు. ఇట్లే మిగిలిన ఋత్విజుల స్థానములకు కూడ పేర్లు కలవు. అవి - (1) బ్రహ్మా (2) ఉద్గాతా (3) హోతా (4) అధ్వర్యుః (5) బ్రాహ్మణాచ్ఛంసీ (6) ప్రస్తోతా (7) మైత్రావరుణః (8) ప్రతిప్రస్థాతా (9) పోతా (10) ప్రతిహర్తా (11) అచ్ఛావాకః (12) నేష్టా (13) ఆగ్నీధ్రః (14) సుబ్రహ్మణ్యః (15) గ్రావస్తుత్ మరియు (16) ఉన్నేతా. యజ్ఞకర్త చేత ధనములచే వరింపదగిన ఈ పదహారుమంది ఋత్విజులను 'యాజకులు' అని పిలిచెదరు. నలుగురు ప్రధాన పూజారులు ఉంటారు. ప్రతి ఒక్కరు నాలుగు వేదాలలో ఒకదానిని సూచిస్తారు: హోతా (ఋగ్వేదం), అధ్వర్యుడు (యజుర్వేదం), ఉద్గాతా (సామవేదం) మరియు బ్రహ్మా (అధర్వవేదం). యజ్ఞ యాగాదులలో పూజారుల సంఖ్య దాని అవసరాలను బట్టి మారుతుంది. సోమయాగాలలో మొత్తం పదహారు ఋత్వికులు చురుగ్గా పాల్గొంటారు.

కొన్ని ప్రసిద్ధ యజ్ఞ-యాగాదుల సంక్షిప్త వర్ణన

యజ్ఞ యాగాదులు అనేక సమూహాలుగా వర్గీకరించబడ్డాయి. యజ్ఞ-యాగాదుల సమగ్ర వివరణ బోధాయన-గృహ్యసూత్రములందు (1.1.18.21) ఈ క్రింద విధముగా ఇవ్వబడినది:

యజ్ఞములను మొత్తం ఇరవైఒక్క సమూహాలుగా వర్గీకరించబడినవి. ఈ యజ్ఞములను మూడు వేదాలలోని ఋగ్, యజుస్ మరియు సామ మంత్ర పఠనముతో నిర్వహిస్తారు. పెంపుడు జంతువులు, అడవి జంతువులు, మొక్కలు మరియు వృక్ష/చెట్ల ఉత్పత్తులు హవిస్సుగా ఉపయోగించే పదార్థాలు. యజ్ఞాన్ని నాలుగు రకాలుగా కూడా వర్గీకరించవచ్చు: స్వాధ్యాయయజ్ఞం, జపయజ్ఞం, కర్మయజ్ఞం మరియు మానసయజ్ఞం. ప్రతి తదుపరి యజ్ఞం మునుపటి దానికన్నా పదిరెట్లు ఎక్కువ ఫలితాన్నిస్తుంది. చివరి భాగం చాలా ఆసక్తికరంగా ఉంది మరియు కొంత వివరణ అవసరం. 'స్వాధ్యాయం' అంటే చదువు మరియు గురుకులంలో నేర్చుకున్న వేదాలను స్మరించుకోవడం. 'జపము' అనేది కొన్ని వైదిక పునరుక్తి శ్లోకాలు లేదా మంత్రాలు. కర్మయజ్ఞ అనేది నిర్దేశించిన కర్మల యొక్క వాస్తవిక పనితీరు. ప్రతీకాత్మకమైనది, వేద ఆచారాలపై ఆధారపడి ఉండును. చివరిదైన 'మానసయజ్ఞం' అన్నిటిలో ఉత్తమమైనదిగా పరిగణించబడుతుంది.

ఇప్పుడు అందుబాటులో ఉన్న వేద మరియు శ్రౌతసూత్రములను అనుసరించి యజ్ఞ-యాగాదుల వివరణలు ఈ క్రింది విధముగ ఉన్నవి:

అగ్నిహోత్రం -

అగ్నిహోత్రం, యజ్ఞం ప్రారంభించిన రోజు నుండి తప్పనిసరిగా చేయవలసిన యాగం అని నిర్ణయించబడినది. దీనిలో హవిస్సు, ఆవు పాలు లేదా పిండి లేదా వండిన అన్నం లేదా పెరుగు లేదా నెయ్యి వాడెదరు. ఆ సమయమున యజమానుడు లేకపోతే, అతని భార్య లేదా అతని కుమారుడు లేదా అతని విద్యార్థి అతని తరపున చేయగలరు.

అగ్నిష్టోమం -

ఇది సోమయాగాలలో మొదటిది మరియు ఇది ఒక ప్రకృతి నమూనా. ఈ సోమయాగం ఐదు రోజులు విస్తరించి, మొత్తం పదహారు మంది పూజారులతో నిర్వహించి చేయవలసిన యాగవిశేషము. ఇది ఏటా వసంతఋతువు నందు నిర్వహిస్తారు. మధ్యందినాసవన, సోమరసంను వెలికితీసే సమయం. ఇందు ఋత్విజులకు యజ్ఞ రుసుమును కూడా పంపిణీ చేయబడు యాగము.

సోమ యాగము -

అగ్నిస్తుతిసాధనమగు అగ్నిష్టోమమను సామముతో సమాప్తియగు యాగము. ఈ యాగము చేసినవారిని 'సోమయాజి' అని పిలిచెదరు. అగ్నిష్టోమ యజ్ఞమునకు పిమ్మట చేయవలసిన యజ్ఞమును 'అత్యగ్నిష్టోమము' అని అందురు. ఇది ఒక సోమయజ్ఞము. అగ్నిష్టోమం, అత్యగ్నిష్టోమం, అతిరాత్రం, అప్తోర్యామం, వాజపేయం మున్నగునవి సోమ యజ్ఞాలు. సోమలతను దంచి తీసిన రసాన్ని పానం చేస్తూ, మూడు సంవత్సరాలు చేసే యజ్ఞాన్ని 'సోమ యాగము' అని అందురు.

అప్తోర్యామం -

అగ్నిష్టోమం యొక్క సవరణే అప్తోర్యామము. ఇది ఏదైనా కోరికను నెరవేర్చడానికి నిర్వహించబడుతుంది. ఈ యజ్ఞ యజమానుడు 1000 లేదా అంతకంటే ఎక్కువ ఆవులను బహుమతిగా ఇవ్వవలెనని శ్రుతి విధి. హోత పురోహితునకు రథం కూడా ఇవ్వవలెను.

అశ్వమేధం -

అశ్వమేధం ఒక మహా యజ్ఞం. 'కల్ప సూత్రం' ప్రకారం ఇది మూడు రోజులు జరిగే యజ్ఞం. మొదటి రోజు చతుష్టోమం. రెండవ రోజు ఉక్థ్యమనే యజ్ఞం. మూడవ రోజు అతి రాత్రం. ఒకప్పుడు అశ్వమేధ యజ్ఞంలో అరణ్య మృగాలను, గ్రామ్య మృగాలను బలి ఇచ్చే ఆచారం ఉండేది. అశ్వమేధ యాగమునకు ఉపయోగించు గుఱ్ఱాన్ని 'అశ్వమేధీయము' అని పిలిచెదరు. అశ్వమేధయాగములు నూరు కావించినవాఁడు ఇంద్ర పదవి నొందునని శాస్త్రము. శుక్ల యజుర్వేదానికి సంబంధించిన శతపథ బ్రాహ్మణంలోని '*అగ్నే ర్వా*

అశ్వః అజ్యం మేధః అనే వాక్యం ప్రకారం అగ్నిలో నేయిని పోసి వ్రేల్చడం మాత్రమే అశ్వమేధమని స్వామి దయానంద తమ సత్యార్థ ప్రకాశంలో స్పష్టం చేశారు. పూర్వ ప్రభువులు కొందరు ఇందుకు భిన్నంగా దిగ్విజయ యాత్రల కోసం అశ్వాన్ని దాని ఇష్టం వచ్చినట్లు పోనివ్వడం, శత్రు రాజులను జయించడానికి అదొక సాకు కావడం, జుగుప్సాకరమైన మరికొన్ని ఆచారాలను పాటించడం జరుగుతుండేది. వాటికి ఆనాడు సైతం వ్యతిరేకత ఉన్నట్టు పౌరాణిక ఆధారాలు ఉన్నాయి. ఇప్పుడు వాటికి సామాజిక ఆమోదం గానీ, శాస్త్ర సమర్థన గానీ లేదు. వామాచార ప్రభావం వల్ల యజ్ఞ కాండలో వేద విహితం కాని జుగుప్సాకర ఆచారాలు ప్రవేశించాయని వేదాన్ని విశ్వసించి గౌరవించే పలువురి విశ్లేషణ.

అతిరాత్రం -

ఇది కూడా ఒక సోమయాగం (జ్యోతిష్టోమం యొక్క ఐచ్ఛిక రూపం) మరియు ఒకరోజు నిర్వహించబడుతుంది. అశ్వినీ దేవతలకు పురోడాశం అందించబడుతుంది. ఒక గొర్రె లేదా పొట్టేలును సరస్వతి దేవతకు బలి ఇస్తారు.

చాతుర్మాస్య -

వాస్తవానికి చాతుర్మాస్య యాగము నాలుగు నెలల వ్యవధిలో మూడు యాగాలను కలిగి ఉంటుంది. అవి: వైశ్వదేవ, వరుణప్రఘాస మరియు శాకమేధ. కొన్నిసార్లు సునాసిరియా యాగము కూడా చేయవలసి ఉంటుంది. వీటిలో ప్రతి ఒక్కటి ఒక ఋతువు యొక్క ఆగమనాన్ని సూచిస్తుంది. అవి పౌర్ణమి రోజులలో ఫాల్గుణ లేదా చైత్ర (ఫిబ్రవరి/మార్చి), ఆషాఢం (జూలై) మరియు కార్తీక లేదా మార్గశిర పౌర్ణమి రోజులలో (నవంబర్) నిర్వహిస్తారు. పురోడాశ మరియు చరువు ప్రధాన హవిస్సులు.

దర్శ-పౌర్ణమాస -

ఇది తప్పనిసరిగా చేయవలసిన యాగము. ఇది ఒక ఇష్టి రకానికి చెందినది. ఇది పౌర్ణమి రోజున ప్రారంభమయి, అగ్న్యాధానం తర్వాత రెండు రోజుల పాటు విస్తరించవచ్చు. నలుగురు ప్రధాన అర్చకులు ఇందులో పాల్గొంటారు.

నిరూఢపశుబన్ధ -

ఆరు నెలలకు ఒకసారి లేదా సంవత్సరానికి ఒకసారి విధిగా నిర్వహించవలసిన యాగము. దీనియందు ఒక మేక లేక గొర్రె జంతువును బలియివ్వడము జరుగుతుంది. ఈ యాగము ద్వారా ఇంద్రుడు మరియు అగ్ని, సూర్యుడు మరియు ప్రజాపతిని శాంతింపవలసిన దేవతలు. ఆరుగురు పూజారులు ఈ యాగమును నిర్వహించును.

పిండపితృ యజ్ఞము -

ఇది యాగము, దర్శ యాగమునకు లోబడి యుండును. ఈ పితృయజ్ఞమునందు, పిండములు లేదా అన్నపు ముద్దలను తయారుచేయుదురు. మూడు పిండాలు (ప్రతి ఒక్కటి తరువాత వచ్చేవి మునుపటి వాటి కంటే పెద్దది) తండ్రి, తాత మరియు ముత్తాతలకు అందించబడుతుంది.

సత్రయాగము -

సత్రయాగ వ్యవధి 12 రోజుల నుండి ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం ఉండవచ్చును. సత్రయాగము నందు పూజారులు ఉండరు. పాల్గొనే బ్రాహ్మణులందరూ యజమానులు అవుతారు. వారి సంఖ్య 17 కంటే తక్కువ ఉండకూడదు మరియు 24 కంటే ఎక్కువ ఉండకూడదు. ఈ యాగము నందు జంతు బలి ఉంటుంది. ఈ యాగము నందు ఒక ఆసక్తికరమైన విషయం ఏమనగా, 100 తీగలుగల, ముంజ గడ్డితో (*Saccharum benghalense*) తయారుచేయబడిన, వీణా వాయిద్యం ఒక ప్రత్యేకమైన ఆకర్షణ.

సౌత్రామణీ యజ్ఞము -

ఇంద్రుడు దేవతగా గల యజ్ఞమును సౌత్రామణీ యజ్ఞము అని అందురు. ఈ యజ్ఞము హవిర్యయజ్ఞమునకు సంబంధించినది. సౌత్రామణీ యజ్ఞము రెండు విధములు: 1. చరక సౌత్రామణీ - ఇది రాజసూయ యజ్ఞములో ఒక భాగము, 2. కౌకిలీ సౌత్రామణీ - ఇది స్వతంత్ర యజ్ఞము. కౌకిలీ సౌత్రామణీ యజ్ఞము, కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి పొందడం కోసం లేదా శ్రేయస్సు పొందడం కోసం నిర్వహించబడింది.

రాజసూయ యజ్ఞం -

అత్యున్నత సార్వభౌమాధికారం లేదా సార్వత్రిక చక్రవర్తి పట్టాభిషేకం సందర్భంగా రాజు స్వయంగా మరియు అతని ఉపనది యువరాజులు నిర్వహించే యజ్ఞమే 'రాజసూయ యజ్ఞం'.

ఇది చాలా సంక్లిష్టమైన యాగము లేక యజ్ఞము. ఇది రెండు సంవత్సరాల పాటు విస్తరించి, అనేక ఇష్టిలు మరియు సోమ యాగాలు కలిగి ఉంటుంది. దీనిని రాజులు లేదా చక్రవర్తులు మాత్రమే నిర్వహించగలరు. ఇందు పూజారులకు 2,40,000 ఆవుల భారీ రుసుము ఇవ్వవలసి ఉంటుంది. అభిషేకనీయ వ్రతం కలిగి ఉండి, రాజుకు లేక చక్రవర్తికి పవిత్ర జలములతో అభిషేకము నిర్వహింపబడును. దీనిని ప్రధానమైనదిగా పరిగణించబడుతుంది.

వాజపేయ యజ్ఞం -

అపరిమిత ఆధిపత్యం కోసం నిర్వహించే ఈ వాజపేయ యజ్ఞానికి అనేక ప్రత్యేకతలు, లక్షణాలు ఉన్నాయి . ఈ వ్రతంలో 17వ సంఖ్య చాలా ముఖ్యమైనది. ఉదాహరణకు: 17 జంతువులు త్యాగం, 17 వస్తువులు రుసుముగా పంపిణీ చేయబడతాయి. మరియు ఈ యజ్ఞము 17 రోజుల పాటు కొనసాగుతుంది. ఇందు నిర్వహింపబడే రథ పందెంలో యజ్ఞ యజమానుడు కూడా పాల్గొంటాడు. మరియు ఎల్లప్పుడూ 'గెలవడానికి' సహాయం చేస్తాడు అనేది మరొక ఆసక్తికరమైన విషయం.

అతిరుద్ర మహా యజ్ఞం -

లింగాకృతిలో ఉండే శివుడిని లేక రుద్రుడిని అభిషేకించడం రుద్రాభిషేకం. ఒకసారి నమకమును, చమకమును పూర్తిగా చెప్పి అభిషేకార్చనలు చేయుటను 'ఏక రుద్రం' అని పిలిచెదరు. ఇలా పదకొండు సార్లు చేస్తే 'ఏకాదశ' రుద్రాభిషేకం. దీనిని 'రుద్రి' అని కూడా అంటారు. పదకొండు ఏకాదశ రుద్రాభిషేకాలు చేస్తే అది లఘు రుద్రాభిషేకం (11 x 11 = 121). పదకొండు లఘు రుద్రాలు (121x11 = 1331), అది మహా రుద్రం అవుతుంది. అలాంటి మహా రుద్రాలు పదకొండు చేస్తే (1331x11 = 14641), దీన్ని 'అతిరుద్రం' అని అంటారు. అంటే పది నాలుగు వేల ఆరు వందల నలుబది ఒక్క సార్లు అభిషేకం చేయడం అతిరుద్రం. వీటినన్నిటిని మహాన్యాస పూర్వకముగా చేయవలయును.

ఈ అతిరుద్ర మహాయజ్ఞము నందు మొత్తం పదకొండు యజ్ఞకుండాలు ఉండును. ప్రతి యజ్ఞకుండము చుట్టూ దీక్షతీసుకున్న పదకొండు ఋత్వికులు కూర్చుందురు. యజ్ఞశాల యందు ప్రతి నిత్యము ఉదయం అరుణపారాయణ తరువాత మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగును. తదనంతరము ప్రతి యజ్ఞకుండమునందు రుద్రహోమం జరుగును. రుద్రహోమము నందు వడ్లు, నువ్వులు, బెల్లం ముక్కలు, చరకు ముక్కలు కలిపిన హవిస్సును ఇవ్వబడును. దీనితో పాటు ఎండబెట్టిన బిల్వ ఫలములు, బిల్వ పత్రములు, కలువ పూలు పదకొండు రోజుల పాటు రుద్రహోమము నందు రుద్రభగవానునికి హవిస్సు సమర్పించబడును.

హవిస్సు / ఆహుతి / ఆహుతులు

హవిస్సు అనగా అగ్నిహోత్రమునందు వేల్చుటకు ఇగురబెట్టిన అన్నము. యజ్ఞ-యాగాదులందు అందించే హవిస్సుల పేర్లు, వాటి రకాలు ఈ విధముగ వివరింపబడినవి. యజ్ఞములలో ముఖ్యమైన హవిస్సులు, అవి -

1. ఆజ్యం (నెయ్యి) - ఆవునెయ్యి మాత్రమే ఆజ్యం.

2. పురోడాశము - హోమము నిమిత్తము నీటితో తడిపి ముద్దగా చేయబడిన పిండిని పురోడాశము అని అనబడును. ఇది యవల పిండి లేక బియ్యపు పిండితో అపూపం (పిండివంట / అప్పం) చేయడం ఒక పద్ధతి. ఈ హవిస్సు బియ్యం మరియు యవల నుండి తయారు చేయబడును. వీటిని గార్హపత్యాగ్నిపై కుండ పెంకుల మీద వేల్చబడును.

3. చరువు - వెన్న మరియు పాలతో ఉడకబెట్టిన బియ్యం మరియు పప్పు ధాన్యము. ఇది ఆంబ, గార్ముత్, గావిధుక, నీవార, ప్రియఙ్గు, యవ, వ్రీహి మరియు శ్యామాక ధాన్యాలముతో తయారు చేయబడును.

4. సక్తు - సక్తు అనేది ముతకగా పిండిచేయబడిన హవిస్సును సూచిస్తుంది. ముఖ్యంగా బార్లీ గింజలు పాలతో ఉడకబెట్టిన హవిస్సు.

5. లాజ - వేయించిన లేదా ఎండిన బియ్యపు గింజలు. ఇంతకు పూర్వం దంచిన బియ్యం వాడరాదు.

6. ధానా - వేయించిన బార్లీ గింజలు లేదా దంచిని బార్లీ పిండి నుండి ఈ హవిస్సును తయారుచేయబడును. ఇది ఋగ్వేదంలో తరచుగా ప్రస్తావించబడింది. ధానా హవిస్సును సోమరసంతో కలిపి హవిస్సుగా వాడెదరని ఋగ్వేదము నందు పేర్కొనబడినది.

7. కరమ్భ - ఇది ఒక రకమైన గంజి లేక జావ. ఇది పొట్టు తీసి, కొద్దిగా ఎండబెట్టి, పిండి యవ లేక బార్లీ గింజల నుండి తయారు చేయబడుతుంది.

8. యవాగు - బార్లీ గంజి లేక జావ లేక అంబలిని యవాగు అని అందురు.

హవిస్సు లేక హవిస్సులను అగ్నికి ఆహుతి చేసిన తరువాత స్వాహా, శ్రౌషట్, పౌషట్, వషట్, స్వధా అనే ఐదు మంత్రాలలో సందర్భాన్ని బట్టి ఏదో ఒక మంత్రాన్ని చెప్పవలసి ఉంటుంది. ఉదాహరణకు : 'అగ్నయే స్వాహా'. 'అస్తు శ్రౌషట్'. 'శిఖాయైపౌషట్'. 'వషట్కరోతి'. 'స్వధాపితృభ్యః'.

హోమపొగ - పర్యావరణంపై ప్రభావం

హోమాగ్నియందు వేల్చబడు అనేక హవిస్సులు, సమిధలు, ఆహుతులు అర్పణ జరుగును. అగ్నిశక్తి మరియు వేదమంత్రముల ఉచ్చారణ ప్రభావము, యజ్ఞం లేదా హోమానికి హాజరయ్యే వారందరికీ ప్రయోజనకరమైన, అత్యంత పవిత్రమైన మరియు శుద్ధి చేసే ప్రచండమైన వాయువులను సృష్టించును. దీని నుండి వచ్చు పొగ మరియు ధూళికణములు వాతవరణముపైన మరియు యజ్ఞమునందు పాల్గొనుచున్న మనుష్యులపై పడినపుడు, ఆ పొగ పీల్చినపుడు, ఏ రీతి ప్రభావం ఉంటుంది అనే విషయం మీద అనేక పరిశోధనలు జరిగినవి. యజ్ఞా-యాగాదులలో ఉపయోగించే హోమ-ఆజ్య, ఆవు పాలతో మాత్రమే తయారు చేయబడింది. ఆవు-నెయ్యిలో అనేక ముఖ్యమైన పోషకాలు, కొవ్వు ఆమ్లాలు, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ-ఆక్సిడెంట్లు మరియు యాంటీ వైరల్ లక్షణాలు ఉన్నాయని కొన్నిశాస్త్రీయ పరిశోధన నివేదికలు సూచిస్తున్నాయి. ఆవునెయ్యి చల్లగా, తీపిగా మరియు సంతృప్త కొవ్వు ఆమ్లాలతో నిండి ఉంటుంది. కొన్ని నివేదికల ప్రకారం, నెయ్యి నిప్పులో వేసినప్పుడు, పైకి లేచి, కొవ్వు కణాలు వాతావరణంలోని ధూళి కణాలపై (వంటగదిలోని వస్తువులపై ఉండే అంటుకునేలా కొంతవరకు సమానంగా ఉంటాయి) మరియు వర్షంతో పాటు భూమిపై పడతాయి. హోమము నుండి వెలువడిన పొగ, శిలీంధ్ర బీజాంశాలను తగ్గించడానికి సమర్ధవంతముగా పనిచేయునని ఒక శాస్త్రీయ నివేదిక తెలిపినది (వేదం వేంకట రామశాస్త్రి మరియు రాఘవ బొడ్డుపల్లి, 2018).

సోమ, సోమలత, సోమవల్లి

సోమలత (*Sarcostemma acidum*) మొక్క నుంచి తీసిన రసాన్ని సోమం లేక సోమ రసం అని అందురు. ఈ సోమ రసాన్ని 'ద్రోణకలశము' అనే యజ్ఞపరికరము నందు నిల్వ చేయుదురు. యజ్ఞాలలో సోమపానం విధిగా జరుగుతుంది. సోమలత తిప్ప తీగ కావచ్చు, కాకపోవచ్చు. కానీ ఈ సోమతీగకు అనేకములైన ఓషధీ గుణాలు ఉన్నాయి.

యజ్ఞాగ్ని

అగ్నిని 'దేవ ముఖ' అని పిలుస్తారు - । '*అగ్నిముఖా ఏవ దేవతాః ప్రీణాతి । అగ్నిం వా అన్వన్యా దేవతాః* ॥ (తై. బ్రా. 3-7-1). అగ్ని యజ్ఞానికి కేంద్ర దేవత. మంత్ర సమర్పణ చేసి ఇచ్చిన హవిస్సులు ఆ యా దేవతలకు అగ్నిద్వారా సమర్పించబడతాయి । *యజ్ఞముఖే యజ్ఞముఖే హోతవ్యాః* ॥ [తై. బ్రా. 3-8-8(30)]. యజ్ఞము మరియు యాగము కోసం పుట్టించేటువంటి అగ్నిని 'యజ్ఞాగ్ని' అని అంటారు. అగ్నిమన్థన పరికరము ద్వారా యజ్ఞాగ్ని ఉద్భవించును. శమీవృక్ష గర్భము నుండి పెరిగిన అశ్వత్థవృక్ష మాను నుండి అరణిని తయారుచేసి, వాటిని అగ్నిమన్థన యంత్రముగా వాడుదురు. అగ్ని ఒకసారి దేవతలనుండి అదృశ్యమై అశ్వరూపము (గుఱ్ఱము) దాల్చి అశ్వత్థ వృక్షమునందు బస చేసినాడని వేదమునందు చెప్పబడినది. అశ్వ మనగా గుఱ్ఱము. ఏ వృక్షమునందైతే అశ్వరూపుడై అగ్ని నివసించెనో ఆ వృక్షానికి 'అశ్వత్థము' అని పేరు వచ్చినది. అగ్ని మన్థన యంత్రముకొఱకు ఉపయోగించే అశ్వత్థవృక్ష మాను, శమీవృక్ష మాను గర్భమునందుండి ఎదిగినదై ఉండవలెను. ఇచ్చట సాధారణ అశ్వత్థవృక్ష మానుని ఉపయోగించరాదు. । '*శమీగర్భాదగ్నిం మన్థతి*' ॥ (తై. బ్రా. 1-1-9), । '*శాన్తయోనిగ్ం శమీగర్భమ్*' ॥ (తై. బ్రా. 1-`2-1). శమీవృక్ష గర్భకోశమునకు శాంతింపజేసే స్వభావము ఉన్నది. అందువలన అగ్నిని శాంతపరచు





గుణము కలిగిన శమీవృక్ష గర్భము నుండి పెరిగిన అశ్వత్థవృక్ష మానుని 'అరణి' తయారీలో ఉపయోగించవలెను.

అగ్ని మన్థన పరికరము, భాగములు మరియు యజ్ఞాగ్ని పుట్టుక విధానము [తై. సం. 1-3-7(12)]

తైత్తిరీయ సంహిత నందు అగ్నిమంథన పరికరము, దాని భాగములు మరియు యజ్ఞాగ్ని ఉద్భవించు విధానము ఈ క్రింది మంత్రము నందు పేర్కొనబడినవి.

మంత్రం:- । అగ్నేర్జనిత్రమసి వృషణౌ స్థ ఉర్వశ్యస్యాయురసి పురూరవా ఘృతేనాఽక్తే వృషణం దధాథాం గాయత్రం ఛన్దోఽను ప్ర జాయస్వ త్రైష్టుభం జాగతం ఛన్దోఽను ప్ర జాయస్వ ॥

క్రింది భాగమున నొక కొయ్యను, పై భాగమున నొక కొయ్యను ఉంచి రెండింటికి మధ్య భాగమున రంధ్రము చేసి ఆ రంధ్రములందు ఒక కాష్ఠమునుంచి పైదానిని గట్టిగా నదిమి పట్టుకొని మధ్యమున నున్న కాష్ట విశేషమును త్రాడు కట్టి కవ్వమునువలె త్రిప్పినచో అగ్నిపుట్టును. క్రింది దారువునకు 'అధరారణి' అనియు, పైన నున్న దారువునకు 'ఉత్తరారణి' అనియు వ్యవహారము. మధ్యమున నున్న కాష్ఠము ఇచట శకలమని వ్యవహరింపబడినది. క్రింది అరణి 'ఊర్వశి'గాను, ఉత్తరారణి 'పురూరవుడు'గాను వర్ణింపబడినవి. ఈ రెండింటి సంబంధమువలన అగ్నిపుట్టును, కావున అరణులు మాతా పితృ స్థానీయములైనవి. యజ్ఞమునకు ముఖ్యముగా కావలసిన అగ్ని, అరణి ద్వయమునుండి పుట్టును (పైన చిత్రం), కావున అరణి ద్వయము యజ్ఞమునకు ఆయుస్థానము వంటివి. (అధ్వర్యుడు అరణి ద్వయమును దర్భలచే అభిమంత్రించి అగ్ని మంథన శకలమును ఆ అరణి ద్వయమునందు సమకూర్చవలెను). ఓ అగ్నీ! నీవు హోత పఠించుచున్న గాయత్రీ, త్రిష్టుప్, జగతీ ఛందస్సులను అనుసరించి అతిశయముగా నుద్భవించుము (అగ్ని పుట్టుటకై అధ్వర్యుడు అరణిని మథించవలెను).

యజ్ఞోపకరణములు - యజ్ఞాయుధములు - యజ్ఞపరికరములు

'యజ్ఞాయుధ' అను పదము తైత్తిరీయ సంహిత 1-6-8 అనువాకము నందు పేర్కొనబడినది. కనుక, ఈ అనువాకమునకు 'యజ్ఞాయుధ సంభృతి' అని పేరు. ఈ అనువాకము నందు పది యజ్ఞాయుధముల పేర్లను చెప్పబడినవి. అధ్వర్యుడు ఈ క్రింది మంత్రము చెప్పుచూ, యజ్ఞాయుధములను సంపాదించవలెను.

మంత్రం:- । యజ్ఞాయుధాని సమ్భరతి యజ్ఞో వై యజ్ఞాయుధాని యజ్ఞమేవ తథ్సమ్భరతి యదేకమేకగ్ం సమ్భరేత్పితృదేవత్యాని స్యుర్యథ్సహ సర్వాణి మానుషాణి ద్వేద్వే సమ్భరతి యాజ్యానువాక్యయోరేవ రూపం క'రోత్యథో మిథునమేవ యో వై దశ యజ్ఞాయుధాని వేద ముఖతోఽస్య యజ్ఞః కల్పతే స్ఫ్యశ్చ కపలా'ని చాఽగ్నిహోత్రహవణీ చ శూర్పం చ కృష్ణాజినం చ శమ్యా చోలూఖలం చ ముసలం చ దృషచ్చోపలా చైతాని వై దశ యజ్ఞాయుధాని య ఏవం వేద ముఖతోఽస్య యజ్ఞః కల్పతే ॥

యజ్ఞ-యాగములందు అనేక రకములైన యజ్ఞ పరికరములను ఉపయోగించబడును. దోషరహితమైన యజ్ఞమును లేక యాగాన్ని నిర్వహించుటకు నిర్దిష్టమైన యజ్ఞోపకరణములను ఉపయోగించవలెనని యజుర్వేదము నందు పేర్కొనబడినది (రాఘవ బొడ్డుపల్లి మరియు వేదం వేంకట రామశాస్త్రి, 2015). ఈ యజ్ఞోపకరణములు ఏ ఏ వృక్ష మానులనుండి తయారుచేయవలెనో కృష్ణ యజుర్వేద తైత్తిరీయ సంహితా 3వ కాండము, 5వ ప్రశ్నము, 7వ అనువాకము నందు వెల్లడించబడినది. ఈ సప్తమానువాకమునందు దర్శపూర్ణమాసాంగభూత స్రుగాదులకు వృక్షవిశేషములు విధింపబడుచున్నవి. ఈ చెట్లు ప్రత్యేకముగా యజ్ఞపరికరముల తయారుచేసే ఏకైక ప్రయోజనం కొరకు ఉపయోగిస్తారు (పట్టిక 01).

వివిధ యజ్ఞములలో అరవైకి పైగా యజ్ఞపరికరములు ఉపయోగించబడుతున్నాయి. ముఖ్యమైన యజ్ఞ పరికరముల పేర్లు, అవి ఏ వృక్షము నుండి తయారు చేయబడును మరియు ఆ వృక్ష బోటనీ పేరు ఇచ్చట పేర్కొనబడినవి: సుక్కు (పర్ణవృక్షము - *Butea monosperma*), స్రువము (ఖాదిరవృక్షము - *Acacia catechu*), జుహువు (పర్ణవృక్షము - *Butea monosperma*), ఉపభృత్తు (అశ్వత్థవృక్షము - *Ficus religiosa*), ధ్రువము (వికఙ్కతవృక్షము - *Flacourtia sapida*), వసోర్ధార (ఔదుంబరవృక్షము - *Ficus racemosa*), స్ఫ్య లేక స్ఫ్యం (ఖాదిరవృక్షము - *Acacia catechu*), శమ్య (ఖాదిరవృక్షము -

Acacia catechu), ఉలూఖలము - ముసలము (వర్ణమాను - *Crateva magna*), ద్రోణకలశము (వికఙ్కతవృక్షము - *Flacourtia sapida*), ప్రాశిత్రహరణ (ఖాదిరవృక్షము - *Acacia catechu*), మేక్షణ (అశ్వత్థవృక్షము - *Ficus religiosa*), పిష్టోద్వపనీ (వర్ణమాను - *Crateva magna*), ప్రణీతము (అశ్వత్థవృక్షము - *Ficus religiosa*), ఉపవేశ (పర్ణవృక్షము - *Butea monosperma*).

ఈ వ్యాసమునందు చాలా ముఖ్యమైన యజ్ఞపరికరముల పేర్లు మాత్రమే ఇవ్వబడినవి. యజ్ఞ-యాగాదులందు ఉపయోగింపబడు అనేక యజ్ఞపరికరములను, రఘువీరా (1934), పూనా మీమాంస సంస్థలో కూర్చొని తన స్వహస్తములతో చిత్రించిన యజ్ఞాయుధ చిత్రములను ఈ వ్యాసమునందు చూడవచ్చును.

సమిధలు - ఇధ్మము

ఒకే వృక్షమునుండి చేర్చిన ఎండిన కఱ్ఱలను ఒక కట్టగా కట్టి యజ్ఞము లేక హోమమునందు ఉపయోగించబడే ఇంధనమును 'సమిధ' లేక 'సమిధలు' అని అందురు. సమిధ సేకరణ వేదవిద్యలో ఒక భాగమని చెప్పియున్నారు. అడవికి వెళ్ళి వేదమంత్రములను వల్లెవేయుచూ సమిధలను సమకూర్చుకొని సాయంసంధ్య వేళకు గురుకులమునకు చేరుకుంటారు. ఈవిధముగా సమకూర్చిన సమిధలను గురుశిష్యులు తమతమ అగ్నికార్యమునకు వినియోగించెదరు. శిష్యుడు గురువునాశ్రయించి వారివద్దనుండి వేదవిద్యను అభ్యసించుటకు మరియు స్వీయ జ్ఞానము పొందుటకు, శిష్యులు చేతిలో సమిధలు ఉంచుకొని అర్థించును. అందువలన స్వీయ జ్ఞానము పొందుటకు సమిధలు చిహ్నాములు.

సమిధలలో అగ్నిదేవతకు ప్రియమైన సమిధలు ఏడు రకములని కృష్ణ యజుర్వేద మంత్రము నందు పేర్కొనబడినది [తై. సం. 4-6-5(25)]. అవి - అశ్వత్థము, ఔదుంబరము, పలాస, శమీ, వైకఙ్కతము, అశనిహత మరియు పుష్కర పర్ణము. కృష్ణ యజుర్వేద తైత్తిరీయ సంహిత యందు నిర్దిష్ట వృక్షజాతి సమిధలు వివిధ యజ్ఞములలో వాటి ఉపయోగములు ప్రస్తావించబడిన అనేక ఉదాహరణలు ఉన్నాయి

(రాఘవ బొడ్డుపల్లి మరియు వేదం వేంకట రామశాస్త్రి, 2015). అవి: ఔదుంబరము (తై. సం. 5-1-10, 5-4-6 మరియు 5-4-7); వైకఙ్కతము (తై. సం. 5-1-9, 5-1-10 మరియు 5-4-7); శమీ (తై. సం. 5-1-9, 5-1-10 మరియు 5-4-7); క్రుముక (తై. సం. 5-1-9) మరియు అశ్వత్థము (తై. సం. 5-1-10).

సంగ్రహ నివేదిక

ప్రతి దేశం దాని స్వంత నమ్మకాలను కలిగి ఉంటుంది. ఈ నమ్మకాలు శతాబ్దాలుగా నిలబడ్డాయి మరియు కొనసాగుతున్నాయి. సనాతన ధర్మము నందు, వేదములు, ఉపనిషత్తులు, భగవద్గీత మరియు పురాణాలను ప్రత్యేకంగా విశ్వసిస్తుంది మరియు ఇప్పటికీ నమ్మి పాటిస్తున్నది. ఇది సహజమైన ఆధ్యాత్మిక అనుభవంగా పరిగణించబడుతుంది మరియు ఈ పవిత్ర గ్రంథములు అత్యంత గౌరవనీయులైన అనేక ఋషుల యొక్క అనుభవాల జ్ఞాపికలు.

ఈ పవిత్ర గ్రంథములందు యజ్ఞ-యాగముల యొక్క దైవిక ఆవిర్భవాన్ని ప్రకటించాయి. కాబట్టి వాటిని మనం తరచు నిర్వహించి, ఆ సంప్రదాయాన్ని కొనసాగించు బాధ్యత మనపై ఉన్నది. అయితే, నేడు ఇవి చాలా అరుదుగా నిర్వహించబడుచున్నవి. కానీ మనస్ఫూర్తిగా ప్రార్థించడం మరియు దేవునికి విజ్ఞప్తి చేయడం కూడా బలంగా కొనసాగుతుంది. నేడు ఆలయ ఆచారాలు, పూజలు మరియు హోమాలు (ప్రైవేట్ మరియు పబ్లిక్ రెండూ), జప రూపంలో (మంత్రాలు మరియు దైవ నామాలను పునరావృతం చేయడం) మరియు భక్తి గానం జరుగుచున్నది. ఇది యజ్ఞ ఆరాధన యొక్క ఆత్మ దైవానికి సంబంధించినది మరియు ఆ దైవానికి నైవేద్యాలు, హవిస్సులు అర్పించడం అది మనల్ని ఇప్పుడు నిలబెడుతోంది.

యజ్ఞము యొక్క సంస్కృతి, హింస (జంతు బలి) అని కొందరు వ్యక్తం చేసినారు. జంతుబలి అనేది ఒక నిర్దిష్ట యాగమునందు మాత్రమే ఉనికిలో ఉందని స్పష్టంగా గమనించాలి. అది నిరూఢపశుబంధ రకం. అటువంటి యాగాన్ని మనం చేయవలసిన అవసరం లేదు. కానీ, మానవునికి ఉపయోగకరమైన మిగిలిన అనేక యజ్ఞా-యాగాదులు మనం తప్పక నిర్వహించవచ్చును, వాటి నుండి మంచి ఫలితములను

పొందవచ్చును. కలియుగమునందు అశ్వమేధ యజ్ఞము చేయనవసరములేదని పెద్దలమాట. కాని, ధర్మాచరణము చేయుచూ ఈ అశ్వమేధ మంత్రములను పారాయణ చేసినచో మంచి ఫలితములు లభించునని ప్రతీతి. మంత్రోచ్చారణ వల్ల ఉచ్చారణ చేసేవారిలోను, మంత్రాన్ని వినినవారిలోనూ పవిత్రత చేకూరుతుంది. మానసిక వికాసం కలిగి మానసికానందం కలుగుతుంది. దానివల్ల ఎన్నో మానసిక రోగాలు దూరమవుతాయి. ఈ మానసికానందం పలువురికి కలగడంతో విశ్వశాంతి ఏర్పడుతుంది. అందువలన రుద్ర, అరుణ ప్రశ్న, అశ్వమేధ యజ్ఞ మంత్ర పారాయణలు అనేక మంది సామూహికముగ దేవస్థానములందు మరియు చాలా సంస్థలు వేదపారాయణ చేయుచున్నారు.

ప్రపంచ హితైషులు భారతీయులు. 'సర్వేజనాస్సుఖినోభవన్తు' అనేది వారి నాదం, 'వేదం'. కనుకనే సర్వజనులు సులక్షణంగా ఉండాలని, సర్వజగత్తు సస్యశ్యామలంగా ఉండాలని వేదం కోరుకోమని చెబుతుంది. వేదాన్ని పరమ ప్రమాణంగా భావించే హైందవులు సర్వజనుల సుభిక్షత కోసం యజ్ఞ యాగాదులు చేయడం పూర్వకాలమునుండి జరుగుచున్నవి. యుగాలు మారినా, సమాజాలు మారినా, భారతీయుల జీవనాడి ఐక్యతారాగమునే ఆలపిస్తుంది. దీనికి ముఖ్యకారణము వేదమునందు విశ్వాసము మరియు నమ్మకము. సర్వజగత్తు సుఖంగా, సంతోషంగా పురోభివృద్ధి చెందాలని కోరుకుంటుంది. అందుకే ఆ వేదకాలంనాటి యజ్ఞ యాగాదులను ప్రభుత్వము మరియు స్వచ్ఛంధ సంస్థలు చేయడానికి నేడు కూడా సంకల్పిస్తూనే ఉన్నాయి. ఆ యజ్ఞనిర్వహణలో కృతకృత్యులు అవుతూనే ఉన్నారు. పూర్వకాలం నుంచి చక్రవర్తులు, రాజులు, మహర్షులు లాంటి వారు సర్వులకు శుభం కలగాలని యజ్ఞ యాగాదులను నిర్వహించేవారు. యజ్ఞమునందు ఉపయోగించు వివిధ సమిధలను అగ్నియందు వ్రేల్చడం వల్ల మానవునిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అనేక మంది శాస్త్రజ్ఞులు నిరూపణచేసినారు. సాత్వికగుణలక్షణాలు పెంపొందుతాయి. పర్యావరణంలోని కాలుష్యాన్ని నియంత్రిస్తుంది. ప్రాణవాయువు పెరుగుతుంది. అనేక రకాల ప్రమాదకరమైన సూక్ష్మ జీవులు నశిస్తాయి.

సారాంశం: యజ్ఞ-యాగాదులు మన ప్రాచీన సమాజంపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గొప్ప ప్రభావాన్ని తప్పక చూపించాయి. మరియు ఈ యజ్ఞా-యాగాదులు సామాజిక శ్రేయస్సు కోసం, వ్యక్తిగత అభివృద్ధి కొరకు, నేటికీ వివిధ రూపాల్లో మనుగడలో ఉంది.

పరామర్శ గ్రంథములు / పరిశోధన వ్యాసములు

1. Chandrasekharendra Saraswathi Maha Swami, 1994. *Sound and Creation*, In: *Hindu Dharma*: *The Vēdas.* English translation of certain invaluable and engrossing speeches of Sri Sri Sri Chandrasekharendra Saraswathi Maha Swami (at various times during the years 1907 to 1994). http://www.kamakoti.org/hindudharma/part5/chap7.htm

2. Kashikar, C.G. 1966. A Survey of the Śrautasūtras. *Journal of the University of Bombay*, New Series, 35 (Part 2), Arts No: 41.

3. Kashikar, C.G. and Dandekar, R.N. 1958. *Śrautakōśa* (Encyclopedia of Vedic Sacrificial Ritual, Sanskrit and English, Eight volumes), Vaidika Samsodhana Mandala, Poona.

4. కృష్ణమూర్తి శాస్త్రి, ఆర్. 1989. కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ సంహిత, వేదార్థ దీపికా సహితము. సంకలనము, అనువాదము మరియు వ్యాఖ్యానము - శిరోమణి రామవరపు కృష్ణమూర్తి శాస్త్రి, తెలుగులో 1 నుండి 7 కాండలు. ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు, తి.తి.దే. రెలిజియస్ పబ్లికేషన్సు సీరీస్ నం: 324. తి.తి.దే. ప్రెస్, తిరుపతి.

5. Ramachandra Rao, S.K. 1991. *Principles of Yajña-Vidhi (Introduction).* Kalpatharu Research Academy Publications, Bangalore.

6. రఘునాథాచార్య, ఎస్. బి. (1982) ఆర్ష విజ్ఞాన సర్వస్వము, మొదటి సంపుటము, వేద సంహితలు, ప్రధాన సంపాదకుడు ఎస్. బి. రఘునాథాచార్య, ప్రచురణ తిరుమల తిరుపతి దేవస్థానములు (తి.తి.దే.), తిరుపతి.

7. Raghava S. Boddupalli and Vedam Venkata Rama Sastri, 2015. Sacrificially Important Trees Revealed in the Kṛṣṇa Yajurvēda Saṃhitā – Their Description and Uses. *Indian Journal of History of Science*, 50(4): 549-564.

8. Raghava S. Boddupalli, 2019. Plant Biology of Yajurveda - Project Report. *Indian Journal of History of Science*, 54(2): 226-237.

9. Raghu Vira, 1934. Implements and Vessels Used in Vēdic Sacrifice. *The Journal of the Royal Asiatic Society of Great Britain and Ireland*, No. 2 (Apr., 1934), pp. 283-305.

10. Swami Harshananda, 2008. *A Concise Encyclopaedia of Hinduism*. Vols. 1-3. ISBN-13 978-81-7907-057-4, Sri Ramakrishna Math, Bangalore.

11. Vedam Venkata Rama Sastry and Raghava Boddupalli, 2018. Chemistry of different oblations (‘*Āhutis*’) in Yajñas and Yāgas. *Vedaganga*, 24: 105-106.

పట్టిక 01: యజ్ఞోపకరణములు తయారుచేయుటకు ఉపయోగించే వృక్షములు

క్రమ సంఖ్య	వృక్షము / మాను	యజ్ఞోపకరణము
1	**ఖాదిర** (*Acacia catechu*)	స్రువ స్ఫ్య ముసల ప్రాసిత్రహరణ అభ్రి ఆసన్ది శమ్య యూప
2	**పర్ణ** (*Butea monosperma*)	స్రుక్కు జుహు ఉలూఖల ఉపవేశ ప్రచరణీ యూప
3	**అశ్వత్థ** (*Ficus religiosa*)	అరణి ఉపభృత్ మేక్షణ ప్రణీత శకట యూప
4	**వైకఙ్కత** (*Flacourtia indica*)	ధ్రువ ద్రోణకలశ అభ్రి అగ్నిహోత్ర హవణి ప్రణీత ప్రోశణి

క్రమ సంఖ్య	వృక్షము / మాను	యజ్ఞోపకరణము
5	**ఉదుమ్బర** (*Ficus racemosa*)	వసోర్ధార ఉలూఖల ఆసన్ది రాజాసన్ది తల్ప రథ వన చమస మహావీర శఫ ధావిత్ర యూప
6	**వరణ** (*Crateva magna*)	ద్రోణకలశ పిష్టపాత్రి లేక పిష్టోద్వపాని శమ్య ప్రణీత ప్రోక్షాణి చమస
7	**వేణు** (*Bambusa arundinacea*)	శూర్ప అభ్రి ధావిత్ర

క్రమ సంఖ్య	వృక్షము / మాను	యజ్ఞోపకరణము
8	న్యగ్రోధ (*Ficus benghalensis*)	ప్రణీత చమస
9	రోహితక (Aphanamixis polystachya)	ప్రణీత చమస
10	బిల్వ (*Aegle marmelos*)	యూప
11	రాజ్జుదాల (*Cordia dichotoma*)	యూప
12	పూతుద్రు (*Cedrus deodara*)	యూప
13	బంక మట్టి	కపాల
14	రాతి పలక	దృషద్ ఉపలా లేక అద్రి
15	వెటస (Calamus rotang)	కట
16	శాల్మలి (*Bombax ceiba*)	రథ
17	దర్భ (*Desmostachya bipinnata*)	రశన కూర్చ
18	ముఞ్జ (*Saccharum munja*)	రశనా వన

యజ్ఞాయుధ



అధిషవణ ఫలకములు



రాజాసంది



సమ్రాడాసంది



ఉఖాసంది

యజ్ఞాయుధ


కూర్చ


శిఖ్య


కృష్ణాజిన

ధమని


శమ్యా


దృషద్ మరియు ఉపలా

ఉలూఖల మరియు ముసల


శకట

యజ్ఞాయుధ

తెడ్డుగరిటెలు

స్రుక్ స్రువము జుహు ఉపభృత్ ధ్రువ

వసోర్ధార



అగ్నిహోత్ర హవళి

స్ఫ్యం



స్ఫ్య - వివిధ ఆకారాలు

యజ్ఞాయుధ

చమస - ఋత్విజుల సోమరస పాత్రలు



యజ్ఞాయుధ

గ్రహపాత్రలు



యజ్ఞాయుధ

ప్రాశిత్రహరణ

ప్రణీత

ప్రణీతాప్రణయాన

ఇడాపాత్ర

అన్వాహారయస్థాలీ

ఆజ్యస్థాలీ

మేక్షణ

శూర్ప

కపాల

DHARMA MURTHY SIVA
SUPERVISING DHARMA ADHARMA
(LAKE AND RIVER WATERS
FICKLE)

COMPETING PRACTICES OF DHARMA AND ADHARMA : SUCCESS AND CONSEQUENCES OF THEIR VOTERIES IN VEDA AND LATER

Nada Vedadhyayana Kendra (R)

Jointly with WAVES, India Branch - Bangalore Chapter

No.437, 17th Cross, 15th Main, 5th Phase
J.P. Nagar, Bangalore-560 078. Ph: 2659 6150/2659 2489

Nada Veda adhyayana kendra.

Publication of Souvenir Courtesy

SMT LALITHA AND RAMA GUNDLAPALLI,
SMT ANNAPURNA AND SRI ANANTH DUVVURI,
SMT SURYASUDHA AND ANJANEYA PRASAD CALYAM
Prasad and Shobha Rani and Dr Chenna Reddy and Padma
Saundaryalahari group and Veda group India and Atlanta,USA